సాక్షి ఒడిశా

బుధవారం । 16 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.45.056లు. బంగారం 1 గ్రాము 50 మిల్లీగ్రాములు. వెండి 5గ్రాముల 600 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'ఉద్యోగాలు ఇవ్వాలి'

విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. రెవెన్షా వర్సిటీ స్నాతకోత్సవానికి ఆమె హాజరయ్యారు. - 8లో.



చీకటి పడితే ట్రాఫిక్ వెతలు

కొరాపుట్‌లో ట్రాఫిక్ వెతలు తప్పడం లేదు. చీకటి పడితే చాలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- 8లో.

న్యూస్‌రీల్

పొట్టంగిలో ఎంపీ బలభద్ర మజ్జి పర్యటన



అగ్ని గంగమ్మని దర్శించుకుంటున్న ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి నియోజకవర్గంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి మంగళవారం పర్యటించారు. పొట్టంగిలో పవిత్ర అగ్ని గంగమ్మ దేవాలయం దర్శించుకున్నారు. అక్కడ పునః నిర్మితమవుతున్న దేవాలయ పనులు పరిశీలించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సుంకిలో బీజేపీ కార్యాకర్తలతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఆ ప్రాంతంలో పలువురు కార్యకర్తల నివాసాలను సందర్శించారు.

బీజేడీ వర్గ విభేదాల్లో మునిగిపోయింది



మాట్లాడుతున్న కనుదాస్, పక్కనే జగదీష్ బిసోయి తదితరులు

కొరాపుట్: ప్రతిపక్ష బీజేడీ పార్టీ వర్గ విభేదాల్లో మునిగిపోయిందని బీజేపీ యువమోర్చ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు కనుదాస్ విమర్శించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితిలో గత మూడేళ్లలో రూ.12 కోట్ల అవినీతి జరిగిందని బీజేడీ పార్టీకి చెందిన మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి విమర్శించిన విషయం గుర్తు చేశారు. ఆ ఆరోపణ జరిగిన తర్వాత రోజే అదే పార్టీకి చెందిన సమితి చైర్మన్, ఇతర సభ్యులు అసలు అవినీతి జరగలేదని కలెక్టర్‌కి నివేదించిన విషయం గుర్తు చేశారు. ఒకరు అవినీతి జరిగిందంటే మరొకరు జరగలేదని ఒకే పార్టీ నాయకులు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ పరిణామంతో ఆ పార్టీలో వర్గ విభేదాలు బయట పడ్డాయని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కుంజదాస్, మాజీ అధ్యక్షుడు జగదీష్ బిసోయి, దేవదాస్ మహాంకుడో తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు

రాయగడ: రెండు దొంగతనాల కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు చందిలి పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో జేకేపూర్ అరవింగనగర్, నువాపడ వీధులకు చెందిన మూస ఒరఫ్ అర్జున్ మినియాక, రాహుల్ ధన్‌బాద్, జొగ ఒరఫ్ రవీంద్ర గౌడా, సురత్ కొండ, మనోజ్ దుర్గలు ఉన్నారు. నిందితుల నుంచి ఎల్‌ఈడీ టీవీ, రెండు మోటార్లు, మూడు వంట గ్యాస్ సిలిండర్లు, ఇత్తడి విగ్రహం, రెండు ఫ్యాన్లతో పాటు 4060 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చందిలి పోలీస్ స్టేషన్ ఐఐసీ ఉత్తమ్ ముమార్ సాహు బుధవారం తెలిపారు. గత నెల 12, 13 తేదీల్లో చందిలి పోలీస్ స్టేషన్ పరిధి జేకేపూర్‌లోని రెండు ప్రాంతాల్లో చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేసి నిందితులను సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. అనంతరం కోర్టుకు తరలించారు.

ఎయిమ్స్ ఆవరణలో ఆందోళన



రాత్రికి రాత్రి మృత దేహం తరలిస్తున్న ఎయిమ్స్ వర్గాలు

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ మరణం తర్వాత శవ పరీక్షలు రాత్రికి రాత్రి ముగించి అడ్డగోలుగా తరలిస్తున్నారని దుమారం రేగింది. సాధారణంగా సూర్యాస్తమయం తర్వాత ఆస్పత్రుల్లో శవ పరీక్షలు నిర్వహించడం జరగదు. సౌమ్యశ్రీ విషయంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఎదురు కావడంతో యువజన, విద్యార్థి కాంగ్రెస్ వర్గాలు ఆకస్మిక ఆందోళనకు దిగాయి. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ ఆవరణలో ఆచార విరుద్ధ చర్యల్ని ఖండించారు. ఈ సందర్భంగా పోలీసులతో ఘర్షణకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

అలసిపోయింది ప్రాణం



గ్రామ జనం మధ్య సౌమ్యశ్రీ అంత్యక్రియలు



గ్రామస్తుల భుజాలపై సౌమ్యశ్రీ అంతిమ యాత్ర (ఇన్‌సెట్లో) సౌమ్యశ్రీ

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని మృతి
- రాష్ట్రమంతటా విషాద ఛాయలు

భువనేశ్వర్: రాష్ట్రం అంతటా విషాదం అలముకుంది. అధ్యాపకుని వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థిని సౌమ్య శ్రీ ఆస్పత్రిలో చావుతో పోరాటం చేసి సోమవారం అర్ధరాత్రి తనువు చాలించింది. బాలాసోర్ ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో చోటు చేసుకున్న విషాద సంఘటన ఇది. భోరుమన్న తల్లిదండ్రుల రోదనతో పలాసియా గ్రామం మారు మోగింది. ఊరంతా ఏకమై భుజాలు మార్చుకుంటూ గ్రామం ముద్దు బిడ్డ సౌమ్యశ్రీకి బరువైన గుండెతో తుది వీడ్కోలు పలికారు.

బాధ్యులకు రాజీ లేని శిక్ష: గవర్నరు

బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని అకాల మరణం బాధాకరమని, ఆమె మరణం విషాదం మాత్రమే కాదని, నేటి విద్యాబోధన ప్రాంగణాల్లో యువతులను కాపాడుకోవాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి ఆవేదన వ్యక్తం చేశారు.
చట్టం తన కఠినమైన మార్గాన్ని అనుసరిస్తుందని, బాధ్యులు రాజీలేని శిక్షను ఎదుర్కొంటారని ఆయన ఉద్ఘాటించారు.

దోషులకు శిక్ష తప్పదు: ముఖ్యమంత్రి

ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాల విద్యార్థిని విషాదకరమైన ఆత్మాహుతి సంఘటనను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తీవ్రంగా పరిగణించి దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. చట్టం ప్రకారం ఆదర్శప్రాయమైన శిక్ష పడేలా చూడాలని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.

వ్యవస్థాపరమైన వైఫల్యం: నవీన్ పట్నాయక్

'చాలా విచారకరమైన సంఘటన. అందరూ షాక్ అయ్యారు. రాష్ట్రం శోకసంద్రంలో మునిగిపోయింది. ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని విషాద మరణం ఉదాసీన వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమ'ని విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. విద్యార్థిని మరణానికి దారి తీసిన సంఘటనల క్రమం సంస్థాగత ద్రోహం తప్ప మరేమీ కాదు అని ఆందోళన చెందారు. న్యాయం కోసం దివంగత విద్యార్థిని చేసిన విజ్ఞప్తిని విస్మరించిన కళాశాల అధికారులు, అధికారంలో ఉన్నవారు ఉభయ వర్గాల్ని జవాబుదారీగా పరిగణించి చర్యలు చేపట్టాలని రాష్ట్ర గవర్నర్‌ను కోరారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: బాలేశ్వర్‌లో ఫకీర్ మోహన్ స్వయం ప్రతిపత్తి కళాశాలలో సౌమ్య శ్రీ మృతిపై పర్లాకిమిడి ప్యాలెస్ రోడ్డులో పలువురు మహిళలు నిరసన తెలిపారు. కళాశాలలో ఆమెను వేధించిన హెచ్ఓడీని అరెస్టు చేయాలని, ఆమెకు న్యాయం జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చూడాలని సామాజిక సేవకురాలు జాస్మిన్ షేక్ డిమాండ్ చేశారు. సాయంత్రం ప్యాలెస్ నుంచి కొవ్వొత్తులతో పలువురు మహిళలు శాంతియుత ర్యాలీ జరిపారు.

రాయగడ: బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ సేనాపతి కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ ఆత్మాహుతికి నిరసనగా ప్రతిపక్షపార్టీలైన బీజేడీ, కాంగ్రెస్‌లు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. స్థానిక కపిలాస్ కూడలిలో బీజేడీ శ్రేణులు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ దిష్టి బొమ్మలను తగుల బెట్టాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా అత్యాచారాలు పెరిగిపోయాయని దుమ్మెత్తిపోశారు. కల్యాణసింగుపూర్ లో మంగళవారం నాడు కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు.



పర్లాకిమిడిలో మహిళల సంఘీభావ ప్రదర్శన



రాయగడ: కపిలాస్ కూడలిలో బీజేడీ ఆందోళన



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సౌమ్య శ్రీ



సౌమ్యశ్రీ స్వగ్రామంలో విషాద ఛాయలు

భగ్గుమన్న బీజేడీ శ్రేణులు



జయపురం: ఆందోళన జరుపుతున్న బీజేడీ నేతలు

జయపురం: బాలాసోర్ జిల్లాలో ఫకీర్ మోహన యూనివర్సిటీలో సౌమ్యశ్రీ మృతిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ఆమె మృతిపై జయపురం బీజేడి శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం జయపురం బీజేడీ శ్రేణులు 26 వ జాతీయ రహదారిని స్తంభింపజేసి ఆందోళనలు చేపట్టారు. ప్లకార్డులు చేత పట్టి రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనలో విక్రమ విశ్వ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.



జయపురం: సౌమ్యశ్రీ ఫొటోతో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థినులు



జయపురం: విక్రమ యూనివర్సిటీలో విద్యార్థినుల నిరసన నినాదాలు

కొరాపుట్‌లో కేంద్రమంత్రి శోభా కరంద్లాజే పర్యటన



సదస్సుకు హాజరైన అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు



కేంద్రమంత్రికి మొమెంటో అందిస్తున్న రాష్ట్రమంత్రులు

కొరాపుట్: జిల్లాలో కేంద్రమంత్రి శోభా కరంద్లాజే మంగళవారం పర్యటించారు. ఆమెకు జయపూర్‌లోని ఎయిర్ స్ట్రిప్‌లో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిత్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆడిటోరియంని సందర్శించారు. అక్కడ గిరిజనులకు ఉపాధి కల్పించే ఎస్సీ, ఎస్టీ జాతీయ విధానం ద్వారా ఎంఎస్ఎంఈ పథకాల అవగాహన సదస్సు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వెనుకబడిన జిల్లాల్లో ఆదివాసీ ప్రజలకు ఉపాధి కల్పించే పథకాలు వివరించారు. అనంతరం కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గోండో, మత్స్య శాఖా మంత్రి గోకులా నంద నాయక్, పరిశ్రమల శాఖా మంత్రి సంపత్ స్వయ్, నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి, కొందమాల్ ఎంపీ సుకాంత్ పాణిగ్రాహి, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి, రఘురాం మచ్చో, నర్సింగ్ బోత్ర, రుపుధర్ బోత్ర, పవిత్ర శాంత, కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో పురుగులు



విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనంలో పురుగులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి కాకలపాడ గ్రామంలో గల ఉన్నత మాధ్యమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పెట్టిన మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించాయి. భోజనం చేస్తున్న ఆహారంలో పెద్ద పురుగు కనిపించిందని 9, 10 తరగతుల విద్యార్థులు తెలిపారు. అనేక మార్లు ఇలాగే కనిపిస్తున్నాయని చెప్పారు. తాము గతంలో ఎన్ని సార్లు ఉపాధ్యాయులకు తెలిపినా తగు చర్యలు చేపట్టలేదని వారు ఆరోపించారు.

నేడు, రేపు బంద్

భువనేశ్వర్: ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ ఆత్మాహుతిపై నిరసనలతో రాష్ట్రంలో పరిస్థితి అట్టుడికిపోతుంది. ప్రధానంగా విపక్షాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విద్యార్థిని ప్రాణాలు బలిగొందని నిందిస్తున్నాయి. విషాదకర సంఘటనని రాజకీయం చేయొద్దని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, రాష్ట్ర కాంగ్రెస్ వరుసగా రెండు రోజులు బంద్‌కు పిలుపునిచ్చాయి. తొలుత బిజూ జనతా దళ్ బుధవారం బాలాసోర్ బంద్ నిర్వహిస్తుందని ప్రకటించింది. విద్యార్థిని మృతిపై ప్రభుత్వ వైఫల్యం కారణంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బిజూ జనతా దళ్ బాలసోర్‌లో ఆరు గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్ జరుగుతుందని ప్రకటించింది. ఈ వ్యవధిలో ముఖ్యమైన సేవలు కొనసాగుతాయి. బంద్ సమయంలో దుకాణాలు, మార్కెటు సముదాయాలు, మోటారు వాహనాల రవాణా, బస్సులు, రైళ్ల రాకపోకలు, పాఠశాలలు మరియు కళాశాలలు మూసివేయాలని అభ్యర్థించారు.

రేపు రాష్ట్ర బంద్

రాష్ట్ర కాంగ్రెస్ ఈ నెల 17 గురువారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. వామపక్షాలు, 8 ఇతర రాజకీయ పార్టీలతో ఉమ్మడిగా ఒడిశా బంద్ నిర్వహిస్తున్నట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ విలేకర్లకు వివరించారు. బాలాసోర్ సంఘటనకు నిరసనగా ఒడిశా బంద్‌కు పిలుపునిచ్చిన కాంగ్రెస్‌తో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), సీపీఐ(ఎం సహా 8 ఇతర రాజకీయ పార్టీలు మంగళ వారం సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒడిశా బంద్ ప్రకటన చేశాయి.

వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగ అవకాశాలు



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అతిథులు



మాట్లాడుతున్న బసంత కుమార్ ప్రధాన్

రాయగడ: విద్యార్థులు వృత్తివిద్యా కోర్సులను అభ్యసిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జిల్లా పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బసంత కుమార్ ప్రధాన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రపంచ యువ నైపుణ్యాభివృద్ధి దినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశ పెట్టాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ బీకే బసంత రాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం బిజయ్ కుమార్ సాహు, జిల్లా విద్యాశాఖ అధికారి రమచంద్ర నాహక్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య



రోదిస్తున్న బాలిక బంధువులు



బాలి మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం జానకీనగర్‌కి చెందిన సుమన హరిజన్ (16) సమీప పోలీస్ రిజర్వ్ బ్యారెక్ సమీపంలోని అటవీ ప్రాంతంలోని చెట్టుకు మంగళవారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగు రోజులుగా బాలిక కనిపించడం లేదని తండ్రి సభాష్ హరిజన్ జిల్లా కేంద్ర పోలీస్ స్టేషన్‌లో సోమ వారం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బంధువులు గాలిస్తుండగా సుమన హరిజన్ మృతదేహం చెట్టుకు వేలాడుతుండడం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి: రాష్ట్రపతి

భువనేశ్వర్: విద్యా సంస్థల్లో స్నాతకోత్సవం భవిష్యత్ సామర్థ్యానికి ప్రతిబింబంగా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కటక్ రెవెన్షా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా మంగళ వారం ఆమె విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల మేధస్సు దేశాభివృద్ధికి దోహదపడాలని సూచించారు.ఉద్యోగాలు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకోకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కటక్ రెవెన్షా బాలికల ఉన్నత పాఠశాల మూడు భవనాల పునరాభివృద్ధికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శంకుస్థాపన చేశారు. వివిధ రంగాలలో విజయానికి కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తున్న మహిళల నుంచి ప్రేరణ పొందాలని రాష్ట్రపతి పాఠశాల బాలికలకు సూచించారు. వారి జ్ఞానం, ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సంకల్పం బలంతో అసాధ్యమైన వాటిని కూడా సాధించగలరని బాలికల్ని ప్రోత్సహించారు. చిన్నారి విద్యార్థులతో రాష్ట్రపతి ముఖాముఖి సంభాషించి, కరచాలనం చేసి మురిపించారు. భారత రాష్ట్రపతితో రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యా విభాగం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కటక్ లోక్ సభ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


రెవెన్షా బాలికల ఉన్నత పాఠశాల పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన ఉత్సవ వేదికపై భారత రాష్ట్రపతితో ఇతర ప్రముఖులు


రెవెన్షా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం


రెవెన్షా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో ఉత్తీర్ణులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి


విద్యార్థినులతో రాష్ట్రపతి కరచాలనం


రెవెన్షా పాఠశాల విద్యార్థినులతో రాష్ట్రపతి సంభాషణ

• రాష్ట్రపతిని కలిసిన గవర్నర్ దంపతులు


భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని స్థానిక రాజ్ భవన్‌లో విడిది చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు దంపతులు రాష్ట్రపతిని కలిశారు.

- భువనేశ్వర్

క్లుప్తంగా

విద్యార్థిని ఆత్మాహుతిపై యూజీసీ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు

భువనేశ్వర్ : బాలాసోర్ ఫకీర్ మోహన్ (అటానమస్) కళాశాలలో విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై వాస్తవాస్తవాలు నిర్ధారించేందుకు విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ప్రొఫెసర్ రాజ్ కుమార్ మిట్టల్ (ఛైర్‌పర్సన్ - యూజీసీ సభ్యుడు), ప్రొఫెసర్ సుష్మా యాదవ్ (మాజీ యూజీసీ సభ్యుడు), డాక్టర్ నీర్జా గుప్తా (వైస్-చాన్సలర్, గుజరాత్ విశ్వవిద్యాలయం), డాక్టర్ అషిమా మంగ్లా (జాయింట్ సెక్రటరీ, యూజీసీ మరియు కోఆర్డినేటింగ్ ఆఫీసర్) సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం 7 రోజుల్లోగా తన పరిశోధనలు, సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పించాలని యూజీసీ ఆదేశించింది. ఈ విచారకర సంఘటన పరిస్థితులు, ప్రస్తుత పరిష్కార విధానాలు, యూజీసీ జారీ చేసిన లైంగిక వేధింపుల నిరోధక నిబంధనలు - 2015 అనుగుణంగా ఉన్న అంశాలను కమిటీ పరిశీలిస్తుంది.

పుట్టగొడుగులకు డిమాండ్


విక్రయానికి సిద్ధంగా ఉన్న పుట్టగొడుగులు

కొరాపుట్: వర్షాలు కురుస్తుండడంతో పుట్టగొడుగుల సీజన్ ప్రారంభమైంది. వీటిని సేకరిస్తున్న వ్యక్తులు విక్రయించేందుకు జయపూర్ మార్కెట్‌కు మంగళవారం భారీగా తీసుకొని వచ్చారు. ఇప్పుడిప్పుడే పుట్టగొడుగులు లభ్యమవుతుండడంతో వీటికి డిమాండ్ పెరిగింది. కిలో 1400 రూపాయల చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు.

బెల్ట్ షాపులపై గిరిజన మహిళల దాడి

కొరాపుట్: బెల్ట్ షాపులపై గిరిజన మహిళలు మూకుమ్మడిగా దాడి చేశారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి బెనరా గ్రామ పంచాయతీ కాలిబెడ గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామంలో బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాల వల్ల కుటుంబాలు నాశనమవుతున్నాయని స్థానిక మహిళలు గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో విసుగెత్తిపోయిన మహిళలు భారీ సంఖ్యలో వెళ్లి ఆ గ్రామంలోని బెల్టుషాపులు తనిఖీ చేసి మద్యం సీసాలు పగలగొట్టారు.

తండ్రికి తలకొరివిపెట్టిన తనయ


అంత్యక్రియలు నిర్వహిస్తున్న లావణ్య

హిరమండలం: తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది ఆ కుమార్తె. ఎల్‌ఎన్‌పేట మండలం శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీష్ (49) కోళ్లఫారం నడుపుతున్నారు. కోళ్లఫారంలో ఉండగా ఆదివారం రాత్రి పాముకాటు వేయడంతో మృతిచెందారు. ఈయన కుమారుడు రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమార్తె లావణ్య లండన్‌లో ఉంటోంది. తండ్రి మరణంతో హుటాహుటిన బయలుదేరి స్వగ్రామానికి మంగళవారం చేరుకుంది. అన్నీ తానై అంత్యక్రియలు పూర్తి చేసింది.

కొనసాగుతున్న వైద్యశిబిరం


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పాతపట్నం: పాతపట్నం ప్రహరాజపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. 28 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని గంగువాడ, చాపర పీహెచ్‌సీ వైద్యులు పూర్ణిమ, లక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి పది మందికి జ్వరాలు తగ్గాయని, పాఠశాలలో 11 మందికి వైద్యం అందిస్తున్నామన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఐదుగురు విద్యార్థినులు చికిత్స పొందుతున్నారని, ఇద్దరికి జ్వరం తగ్గడంతో డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ జి.వేణుగోపాల్ తెలిపారు. వైద్య శిబిరాన్ని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ పరిశీలించారు.

సింగుపురంలో చైన్‌స్నాచింగ్

శ్రీకాకుళం రూరల్: సింగుపురం లో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని ఇద్దరు దుండగులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. రూరల్ ఎస్‌ఐ ఇచ్చిన వివరాల మేరకు.. సింగుపురం గ్రామానికి చెందిన చలుమూరి వెంకట కుమారి స్థానిక ఏటీఎం వద్ద డబ్బులు తీసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు తొడిగి నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి మూడు తులాల బంగారు తాడును తెంచేసి పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారులు

జయపురం: అనుగూలులో జరిగిన అంతర్ రాష్ట్ర కిక్ బాక్సింగ్ పోటీలలో జయపురం బాక్సింగ్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. జయపురం నుంచి పాల్గొన్న 13 మంది 16 పతకాలు సాధించి సత్తాచాటారు. వీటిలో ఏడు బంగారు, రెండు రజత, ఏడు కాంస్య పతకాలు ఉన్నట్టు స్థానిక ఇండియన్ అల్టిమేట్ ఫైట్ క్లబ్బు శిక్షకులు సాయిద్ హబిబ్ మంగళవారం వెల్లడించారు. అనుగూల్ టేబుల్ టెన్నిస్ ఇండోర్ గ్రౌండ్‌లో ఈ పోటీలు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర క్రీడా, యువ సేవా విభాగం, రాష్ట్ర అమిచూర్ కిక్ బాక్సింగ్ మహాసంఘం సంయుక్తంగా పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక అల్టిమేట్ ఫైట్ క్లబ్బు నుంచి 13 మంది పోటీల్లో పాల్గొన్నారన్నారు. తరుణ ఖోస్ల రెండు బంగారు, రాహుల పట్నాయక్, బిజయ సాహు, రిహాన్ ఖాన్, శేఖ్ శెహబాజ్ హుసేన్ రంజిత్ కుమార్ ఒక్కో బంగారు, అభిషేక్ దాస్, మానస నాయిక్ ఒక్కో రజత, మోహిద్ యాదవ్ రెండు కాంస్య పతకాలు సాధించగా, శేఖ్ శెహబాజ్ హుసేన్, అభిషేక్ దాస్, కె.బాహుల్య, రిహాన్ ఆలీ, ఆర్యన్ మిశ్రలు బ్రాంజ్ పతకాలు సాధించినట్టు పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారిలో ఇద్దరు బాలికలు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఏఐ పోటీల విజేతగా ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాల జట్టు

ఇచ్ఛాపురం: అమెజాన్ కంపెనీ హ్యాక్ టూ ఫ్యూచర్ పేరుతో నిర్వహించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) జోనల్ స్థాయిలో పోటీల్లో ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాల జట్టు ప్రథమస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పి.దీపక్(10వ తరగతి), జాహ్నవి(9వ తరగతి), హేమలత(8వ తరగతి) బృందం ప్రథమ స్థానం సాధించి బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను ఐటీ ట్రైనర్ ఉమాశంకర్, కుమార్‌స్వామి అభినందించారు.

పాన్‌షాప్ వ్యాపారిపై దాడి

నరసన్నపేట: స్థానిక పెద్దపేట కూడలి వద్ద పాన్ షాపు యజమాని కోరాడ రాకేష్‌పై ముగ్గురు యువకులు గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాకేష్‌కు గాయాలు కావడంతో నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ముగ్గురు యువకులు వచ్చి అకారణంగా దాడికి దిగారని, షాపును ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పట్టణ వ్యాపారులపై ఈ విధంగా ఎప్పటికప్పుడు దాడులు జరుగుతుండటంతో వ్యాపార వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని పట్టణ వర్తక సంఘం, కళింగ కోమట్లు సంఘం తీవ్రంగా ఖండించాయి. ఇటువంటి భౌతికదాడులకు ఎవరు పాల్పడినా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, పొట్నూరు ప్రసాద్ ప్రకటనలు విడుదల చేశారు.

దేవాదిలో విషాదం

నరసన్నపేట: దేవాది ఫ్లైఓవర్ వంతెన వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బండి కృష్ణ (38) మృతి చెందారు. మడపాం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తండ్రి కృష్ణ మృతి చెందడంతో కుమార్తెలు మోహిని, యోగితలు అనాథలయ్యారు. తల్లి స్వాతి ఇటీవలే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. దీంతో కృష్ణ అన్నీతానై పిల్లలను చూస్తున్నాడు. ఇంతలో మృత్యువు వెంటాడటంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కృష్ణ చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. దేవాది వద్ద టైర్ పంక్చర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యకు క్యాన్సర్ సోకడంతో ఆమె చికిత్స నిమిత్తం లక్షల రూపాయలు అప్పులు చేశాడు. అయినా కాపాడలేక పోయాడు. కృష్ణ పెద్ద కుమార్తె మోహిని మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి, రెండో కుమార్తె యోగిత ఆరో తరగతి చదువుతోంది. ప్రస్తుతానికి ఇదే గ్రామంలో ఉన్న కృష్ణ అత్తమామలు ధర్మాన నీలం, సాయమ్మ వద్ద ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చీకటి పడితే ట్రాఫిక్ వెతలు!


రాజకోట వద్ద స్తంభించిన ట్రాఫిక్

కొరాపుట్: చీకటి పడితే ట్రాఫిక్ వెతలు వెంటాడుతుండడంతో రాజానగర్ వైపు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. కొరాపుట్ జిల్లా జయపూర్ పట్టణంలో పురాతన రాజానగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుపోతుంది. రథాయాత్ర అనంతరం అక్కడ రఘునాధ మందిరం వద్ద రథం నిలుపుతారు. రథం విడి భాగాలు చేసేంత వరకు ఈ సమస్య ఉంటుంది. రథం చుట్టూ అనేక వాహనాలు పార్కింగ్ చేస్తారు. వాహనదారులు ఎంత మోర పెట్టుకున్న పార్కింగ్ నుంచి వాహనాలు తీయరు. దీంతో నిత్యం వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతాన్ని కలుపుతూ ఐదు రోడ్లు ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటుంది. సాయంత్రమైతే వాహనాలను విచ్చలవిడిగా నిలిపి వేస్తుండడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తక్షణం రాజానగర్ రథం వద్ద ట్రాఫిక్ పోలీసుల సంఖ్య పెంచి అక్రమ పార్కింగ్‌లపై చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రథం వద్ద ఆటోల అక్రమ పార్కింగ్


రాజానగర్ మెయిన్ రోడ్డు వైపు నిలిచిపోయిన వాహనాలు

పాముకాటుతో వృద్ధురాలి మృతి

టెక్కలి రూరల్: సీతాపురంలో మంగళవారం పాముకాటుకు గురై అదే గ్రామానికి చెందిన మూల నారాయణమ్మ (75) అనే వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణమ్మ తన కుమారుడు తవుడుతో కలిసి ఉంటోంది. ఇతను చిన్నబజార్‌లో టైలరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం తవుడు షాపుకు వెళ్లిపోయిన తర్వాత వృద్ధురాలు బయటకు వెళ్లేందుకని చెప్పుల స్టాండ్ వద్దకు వెళ్లింది. చెప్పులను తీస్తుండగా అప్పటికే అందులో ఉన్న పాము కాటువేసింది. చూపు సరిగా లేకపోవడంతో నాగుపాము అని గుర్తించలేకపోయింది. కొంతసేపటికి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పాముకరిచి చాలా సమయం కావడంతో పరిస్థితి విషమించి మృతిచెందింది.

గుప్తేశ్వరం ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


కొరాపుట్ వైద్య కళాశాలలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర

కొరాపుట్: గుప్తేశ్వరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర మంగళవారం పరామర్శించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ వైద్య కళాశాలను సందర్శించారు. ఆదివారం సాయంత్రం గుప్తేశ్వరం సమీపంలో అగ్ని మాపక వాహనం బ్రేక్ ఫెయిలై బోల్‌భాం భక్తులపైకి దూసుకెళ్లడంతో ఒక బాలుడు మృతి చెందగా మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన వారిని తొలుత బోయిపరిగుడ సమితి కేంద్రం ఆస్పత్రికి తర్వాత జయపూర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడం కొరాపుట్‌లోని వైద్య కళాశాలకి తరలించారు. ఈ ఘటనలో బాలుడు చనిపోగా.. అతని ఇద్దరు సోదరులకు కూడా గాయాయ్యాయి. ఎమ్మెల్యే క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి అవసరాల నిమిత్తం కొంత ఆర్థిక సహాయం చేశారు.

మృత్యువులోనూ వీడని బంధం


సంఘటనా స్థలం వద్ద మృత దేహాలు

- ట్రాక్టర్ బోల్తా పడి అన్నాచెల్లెల్లు మృతి
- ప్రమాదం నుంచి బయటపడిన మరో నలుగురు
- కామేశ్వరిపేట సమీపంలో ప్రమాదం
- లుకలాంలో విషాదఛాయలు

నరసన్నపేట: రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెల్లు మృత్యువాతపడిన విషాద ఘటన నరసన్నపేట మండలం కామేశ్వరిపేట సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..
నరసన్నపేట మండలం లుకలాం గ్రామానికి చెందిన గొద్దు ఆదినారాయణ(42), చోడి లక్ష్మి (35), జి.బంగారమ్మ, లంక శ్రీనివాస్, గొద్దు అశోక్‌కుమార్‌లు ఓ కర్రల వ్యాపారి వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. వీరిలో ఆదినారాయణ, లక్ష్మి అన్నాచెల్లెలు. పరిసర గ్రామాలకు వెళ్లి కర్రలు కొట్టడం, వాటిని ట్రాక్టర్‌పై లోడ్ చేసి తరలించడం వీరి దినచర్య. దీనిలో భాగంగా మంగళవారం స్వామి అనే వ్యక్తి ట్రాక్టర్‌పై కామేశ్వరిపేటకు బయలుదేరారు. కొల్లవానిపేట రైల్వే గేటు దాటి కొంత దూరం వెళ్లేసరికి టైర్ పంక్చర్ అయింది. వేగంగా వెళ్తుండటంతో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న లోతైన ప్రదేశంలో తుప్పల్లోపడింది. ట్రాక్టర్, ఇంజన్ చెరోవైపు పడిపోయాయి. ట్రాక్టర్ కింద ఆదినారాయణ, లక్ష్మి ఇరుక్కుపోయారు. మిగిలిన వారు తేరుకుని వీరిద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌కు ఫోను చేయగా కొద్దిసేపటికే మరణించారు.

కూలి పనులు చేస్తూ..

విజయనగరంలోని నెల్లిమర్ల ప్రాంతానికి చెందిన ఆదినారాయణ, లక్ష్మి లుకలాం వచ్చి స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచీ ఏ పనికి వెళ్లినా అన్నాచెల్లెల్లు కలిసే వెళ్లేవారు. మృత్యువులోనూ అన్నాచెల్లెల్లు బంధం వీడలేదంటూ గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. లక్ష్మికి భర్త చిన్నారావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదినారాయణకు భార్య గున్నమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నరసన్నపేట ఇన్‌చార్జి ఎస్‌ఐ, పోలాకి ఎస్‌ఐ రంజిత్ ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సర్పంచ్ శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు చింతల వెంకటరమణ, చింతల సత్యం, కామేశ్వరపేటకు చెందిన జోగినాయుడు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీనిచ్చారు.


ఆదినారాయణ(ఫైల్)


లక్ష్మి(ఫైల్)



గంజాయి ముఠా అరెస్టు


పట్టుబడిన నిందితులతో పోలీసులు

కాశీబుగ్గ: బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గంజాయి ముఠాను కాశీబుగ్గ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఆశాదేవి, అనితాదేవి, ఊహాదేవిలు పాట్నాలో ఓ అపార్ట్‌మెంట్‌లో వంట మనుషులుగా పనిచేస్తున్నారు. వీరికి పింకీ అనే మహిళ ద్వారా శుభరాత్, అంబాజ్ గౌడ్‌లు పరిచయమయ్యారు. సులభంగా సొమ్ము సంపాదించాలనే ఆశతో ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి బీహార్, కేరళ రాష్ట్రాలకు తరలించేందుకు వ్యూహరచన చేశారు. ఈ క్రమంలో పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైలు ఎక్కే ప్రయత్నంలో కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి పలాస కోర్టుకు తరలించామని చెప్పారు. సమావేశంలో సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.




రసాయనాన్ని అన్‌లోడ్ చేస్తున్న టెక్నికల్ నిపుణులు


కార్మికుడికి ప్రథమ చికిత్స చేయిస్తున్న దృశ్యం


వాటర్ స్ప్రే చేస్తున్న భద్రత నిపుణులు

విపత్తుల వేళ.. జాగ్రత్తలు ఇలా..

పైడిభీమవరం పారిశ్రామికవాడలోని మెస్సర్స్ ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్ పరిశ్రమలో రసాయనిక ప్రమాదాల నివారణపై మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అమ్మోనియా ట్యాంకర్ దించినప్పుడు వాల్వ్ విరిగిపోవడం, అకస్మాత్తుగా గ్యాస్ లీక్ సంభవించడం, ఉద్యోగులు గాయపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ కళ్లకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణయ్య, ఈహెచ్‌ఎస్ మేనేజర్ ఎన్.రాఘవరెడ్డి, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

- రణస్థలం

అవగాహన లోపం.. పాములకు ప్రాణసంకటం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండ చిలువ(ఫైల్)

- అంతరించి పోతున్న సర్పజాతులు
- రైతు మిత్రులకు రక్షణ కరువు
- నేడు వరల్డ్ స్నేక్ డే

భామిని: వ్యవసాయ రంగంలో కీలకమైన రైతు మిత్రులలో సరీసృపాలుగా పిలిచే పాకెడి జీవులున్నాయి.ఈ కోవలో ఒకటైన సర్ప జాతి జీవులపై అవగాహన లోపంతో అంతరించి పోయే దుస్థితి ఏర్పడింది. హైందవ సంప్రదాయంలో పవిత్ర స్థానం గల సర్పాలకు పూజలు, నోములు చేపట్టిన చోటే అవగాహన లోపంతో అంతం చేసే సంస్కృతి సాగుతోంది. దెబ్బ తగిలిన పాము పగ పడుతుందనే కల్పన, పాము కాటు వేస్తే విష ప్రభావంతో మరణిస్తామనే భయంతో వాటిని హతం చేస్తున్నారు. దీంతో జన బాహుళ్యంలో పాముల మనుగడ కష్టమైంది. రైతు పండించే పంటలో నలభై శాతం స్వాహా చేస్తున్న ఎలుకలు, పందికొక్కుల నివారణలో కీలక పాత్రధారిగా పిలిచే సర్పాలకు నిలువ నీడ లేకుండా పోతోంది. పర్యావరణ పరిరక్షణలో కీలకంగాను, భూ సారాన్ని కాపాడే ముఖ్యమైన పాకెడి జీవిగా గుర్తింపు పొందినా తగిన రక్షణ కరువవుతోందని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వ్యవసాయంతో కష్టాలు

ప్రధానంగా వ్యవసాయ రంగంలో క్రిమి సంహారక మందుల ప్రవేశంతో పాకెడి జీవుల అంతరించిపోతున్నాయి. విష తుల్యమైన జీవులను వేటాడి భుజించి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆధునిక యంత్రాల వాడకంలో పుట్టలు, తుప్పలు, దిబ్బలు లేకుండా, భూమిలో బొరియలు కూడా కరువై పాముల జీవనం కష్టమైందని చెప్పవచ్చు.

విష సర్పాలు తక్కువ..

మన చుట్టూ తిరుగుతున్న పాములలో 80 శాతం సాధారణ విషంలేని సర్పాలే ఉన్నాయి. విషపూరితమైనవి, ప్రాణాంతకమైనవి కొద్దిగానే ఉన్నాయి. మన ప్రాంతంలో వీటిలో నాలుగు రకాలైన తాచుపాము(నాగుపాము), రక్తపింజర, కట్లపాము, పొడపాములుగా గుర్తించారు. పాము కాటుకు గురైన వ్యక్తుల్లో అత్యధికంగా భయంతోనే ఎక్కువ మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

పాములపై అవగాహన..

విద్యార్థి స్థాయి నుంచి పాములపై అవగాహన కల్పించాలి. అన్ని పాములు ప్రమాదకారి కావని తెలియజేయాలి. పాము పగబడుతుందనే మూఢ నమ్మకాలు విడిచి పెట్టేలా అవగాహన కల్పించాలి. స్నేక్స్ ఫ్రెండ్లీ సొసైటీలు ఏర్పాటు కావాలి. అన్ని పాములను సంహరించడం తగదు.కొట్టి చంపకుండా, పట్టి దూరంగా విడిచి పెట్టాలి. జాతులు అంతరించ పోకుండా చూడాలి.

పాము కనిపిస్తే సమాచారం ఇవ్వండి..



పాములు కనిపిస్తే సమాచారం ఇవ్వండి. సర్ప జాతుల సంరక్షణకు స్నేక్ రెస్క్యూ టీమ్ తరలి వస్తుంది. ప్రాణాపాయం లేకుండా పట్టుకుని అడవుల్లో విడిచి పెడతాం. అటవీశాఖాధికారుల సహకారంతో గ్రీన్ మెర్సీ సంస్థ ఉచితంగా సేవలు అందిస్తుంది. సర్ప జాతులను చంపవద్దు. ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది. పాములుంటే వ్యవసాయానికి మేలు. ఎలుకలు, పందికొక్కులు లేకుండా చేస్తాయి.పాము కనిపిస్తే హెల్ప్‌లైన్ నంబర్ -9848414658కు తెలియ పరచండి.

– కేవీ రమణమూర్తి, సీఈఓ, గ్రీన్‌మెర్సీ

పాములన్నీ విష సర్పాలు కావు..



పాములన్నీ విష సర్పాలు కావు.అన్ని పాములకు విషం ఉండదు. పాము కాటు వేస్తే చనిపోవడం ఖాయమనే భయాన్ని వీడాలి. ప్రమాదవశాత్తు పాముకాటుకు గురైనా భయపడవద్దు. అందుబాటులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకురండి. విషాన్ని నివారించే ఏంటీస్నేక్ వీనమ్(ఏఎస్‌వీ) మందులు అందుబాటులో ఉన్నాయి. పాముకాటు పడిన తరువాత గాయాన్ని కడగవద్దు. పాము వేసిన గాట్లు గుర్తించి విషప్రభావం లెక్కించి ఏఎస్‌వీలు వేస్తాం.

– డాక్టర్ కె.విజయ పార్వతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సీతంపేట

క్లుప్తంగా

పెద్దగెడ్డలో పూడిక తీత పనులు



విశ్వనాథపురం బట్టీ వద్ద మొదలు పెట్టిన పెద్దగెడ్డ కాలువ పూడిక తీత పనులు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: 'పెద్దగెడ్డ.. పూడికలకు అడ్డా' శీర్షికన సాక్షిలో ఈ నెల 13న ప్రచురితమైన కథనంపై పెద్దగెడ్డ అధికారులు స్పందించారు.ఈ మేరకు పెద్దగెడ్డ కాలువ పూడిక తీత పనులు ప్రారంభించారు.ముందుగా కాలువల్లో తుప్పల తొలగింపు చేపట్టారు. జేసీబీతో తుప్పలను తొలగిస్తున్నారు.ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేయించి ,పెద్దగెడ్డ నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు జేఈ మోహనరావు తెలిపారు.

డీఐఓగా అదనపు బాధ్యతలు



డాక్టర్ జగన్మోహన్‌రావుకు ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా డాక్టర్ జగన్మోహన్‌రావు అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం డాక్టర్ జగన్మోహన్‌రావు ఆర్‌బీఎస్‌కే, ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారిగా కొనసాగుతున్నారు. గత నెల డీఐఓ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఆ పోస్టు ఖాళీగా ఉన్నందున గతంలో డీఐఓ ఇన్‌చార్జిగా జగన్మోహ రావుకు జిల్లాలో టీకా కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించిన అనుభవం ఉన్నందున ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముద్దాయికి ఏడాది జైలుశిక్ష

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ఓ యువతిని మోసగించి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి ఏడాది కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10వేలు జరిమానాను న్యాయస్థానం విధించినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలు ఆయన వెల్లడించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో 2021వ సంవత్సరంలో నమోదైన కేసులో ముద్దాయి మజ్జి రామరాజుకు విజయనగరం మహిళ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎన్.పద్మావతి పై విధంగా మంగళవారం తీర్పు వెలువరించారన్నారు. ముద్దాయి అదే గ్రామానికి చెందిన యువతికి మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భం దాల్చిన అనంతరం పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో తగిన సాక్ష్యాధారాలతో అభియోగ పత్రం దాఖలు చేశారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తయ్యి నేరారోపణలు రుజువు కావడంతో శిక్ష ఖరారైనట్లు చెప్పారు.

1100 కేజీల చేపల మృతి

- చెరువులో విషం కలిపిన దుండగులు



చెరువులో మృతిచెందిన చేపలు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ సమీపంలో ఉన్న పాచిబంద చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతో రూ.లక్షా 50వేల విలువ చేసే 1100 కేజీల చేపలు మృతి చెందినట్లు యజమాని పొట్నూరి ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. జీవనాధారం కోసం అప్పులు చేసి దత్తి గ్రామంలో చెరువు వేలం పాట పాడి చెరువులో వేసిన చేపలను వేయగా గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతో అవి మృతి చెందాయని, తాను చేసిన అప్పులు ఎలా తీర్చేదని ఆవేదన చెందుతున్నాడు. గ్రామపెద్దలు, పెదమానాపురం పోలీసులకు ఈ సమాచారం అందజేసినట్లు తెలిపాడు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

విజయనగరం: నగరంలోని బొగ్గులదిబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. సామాజిక ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్లబ్ తరఫున విటమిన్ మాత్రలు, డ్రై ఫ్రూట్స్, పౌష్టికాహార విలువలు కలిగిన పౌడర్‌ను 67 మందికి అందజేశామని క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ ఉదయ్, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ సుధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి భవానీకి జేసీ అభినందనలు



క్రీడాకారిణి భవానిని అభినందించిన జేసీ సేతు మాధవన్

విజయనగరం: కజకిస్థాన్‌లో జరిగిన జూనియర్ ఆసియన్ చాంపియన్ షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించిన జిల్లాలోని కొండకరకాం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రెడ్డి భవానిని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. ఈ మేరకు తన చాంబర్‌లో మంగళవారం ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరఫున రూ.25వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. వచ్చే ఒలింపిక్స్ పోటీల్లో పతకాన్ని సాధించి, దేశానికి, జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భవానీకి పౌరవేదిక సత్కారం



వెయిల్‌లిఫ్టర్ భవానీని సత్కరిస్తున్న పౌరవేదిక ప్రతినిధులు

విజయనగరం మండల పరిధిలోని కొండకరకాం గ్రామంలో అతి సామాన్య కుటుంబంలో జన్మించిన రెడ్డి భవాని ఇటీవల కజికిస్థాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్ లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలను సాధించి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ ప్రతిష్టను పెంచిందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో బంగారు పతకాల విజేత ఏషియన్ వెయిట్ లిఫ్టర్ రెడ్డి భవానీని ఘనంగా సన్మానించారు. భవాని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తగిన ఆర్థిక సహాయం చేయాలని ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు లకు పౌర వేదిక తరఫున వినతిపత్రాలు పంపిస్తామన్నారు. ఈ సత్కారసభలో భవానీ కోచ్ ఆనంద్, పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, తుమ్మగంటి రాంమోహన్, ధవళ కొండబాబు, అల్లంశెట్టి నాగభూషణం, పోలుపర్తి అప్పారావు, థాట్రాజు రాజారావు, జాగరపు ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లాకు పతకాలు



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 12, 13 తేదీల్లో అనకాపల్లి జిల్లా సబ్బవరంలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. కాటా, కుమిటీ విభాగాల్లో జరిగిన పోటీల్లో పి.హేమంత్ రెండు బంగారు పతకాలు, కె.శివగణేష్ బంగారు, సిల్వర్ పతకాలు, ఎల్.జశ్వంత్ బంగారు, సిల్వర్ పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా పి.వెంకటరమణ కె. మోహన్‌రావు, కె.పరమేష్, ఎస్.జనని, కె.స్నేహ, వి.ఇంద్రాణి, ఎం.సాత్విక్, బి.లెనిన్, జి.వివేక్ వర్మలు పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. పోటీల్లో పతకాలు దక్కించుకున్న క్రీడాకారులను కరాటే అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంతోష్ కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు డీఏవీ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో కోచ్ తిరుపతిరావు

రాజాం సిటీ: త్వరలో నెల్లూరు, ఒంగోలులో జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు రాజాంలోని డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 12, 13 తేదీల్లో శ్రీకాకుళం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్ లెవెన్ సింగిల్స్‌లో బి.పుష్కర్ ప్రథమ బహుమతి సాధించగా, రన్నరప్‌గా యు.కౌశిక్‌నాయుడు నిలిచాడని చెప్పారు. అండర్ లెవెన్ డబుల్స్ విన్నర్‌గా బి.పుష్కర్, యు.కౌశిక్‌నాయుడులు నిలిచారు. అండర్ -13 బాలికల విభాగంలో పి.నిషిక, పి.లాస్య ప్రియ, బాలుర విభాగంలో పి.గోవర్ధన్, అన్షుమాన్‌లు ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వారి ఎంపికపట్ల జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, పీఈటీ అప్పలనాయుడు, కోచ్ పప్పల తిరుపతిరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రెజ్లింగ్ పోటీల్లో విజేతలుగా గుంపాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని గుంపాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 13న తిరుపతిలో జరిగిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ కుస్తీ క్రీడా పోటీల్లో గుంపాం గ్రామానికి చెందిన కె.హర్షవర్ధన్, ఎ. గౌతమ్, పి.గిరీష్, టి.హేమని, పి.రవిజిత్ కుమార్, కె. సంజయ్‌లు పాల్గొని పతకాలు సాధించారు. ఈనెల 26న జాతీయస్థాయిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరగనున్న పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలవడంతో హెచ్ ఎం సూర్యకుమారి, పీఈటీ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు షేక్‌మస్తాన్, ఉమ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



కరాటే చాంపియన్ షిప్‌లో విజేతలు

విజయనగరం అర్బన్: విశాఖ జిల్లా సబ్బవరంలో జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే చాంపియన్ షిప్-2025 పోటీల్లో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి ఒకప్రకటలో తెలిపారు. కరాటేలోని కాటా, కుమిటీ కేటగిరిలో పి.హేమంత్ రెండు బంగారు పతకాలు, ఎల్.జశ్వంత్, కె.శివగణేష్, పి.వెంకటరమణ, కె.ప్రేమేష్, ఎస్.జనని, జి.వివేక్ వర్మ ఒక్కో బంగారు పతకం సాధించారని పేర్కొన్నారు. కోచ్ సంతోష్, విజేతలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

అదానీ బృందాన్ని అడ్డుకున్న గిరిజనులు



మారిక వెళ్లకుండా మార్గమధ్యంలో కంచె పెట్టి ఆందోళన చేస్తున్న గిరిజనులు, సీపీఎం నేత శ్యామ్

వేపాడ: ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఊరు విడిచివెళ్లమంటూ మారిక గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. అదానీ బృందం సభ్యులు, అధికారులు మారిక వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్‌తో పాటు జాలారి వీర్రాజు, గమ్మెల బాబురావు, సోమేష్, అప్పలనాయుడు, పలువురు మహిళలు అదానీ బృందం, అధికారులు కొండెక్కకుండా రోడ్డుకు అడ్డుగా కంచెవేసి బ్యానర్ పెట్టి మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. అదానీ గ్రూప్ గో బ్యాక్.. అధికారులు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

ఖతర్‌లో వెల్డర్ ఉద్యోగావకాశాలు

పార్వతీపురం టౌన్: ఖతర్ దేశంలో వెల్డర్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెల్డర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసే అభ్యర్థుల వయస్సు 24 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీవెల్డర్ ఉద్యోగానికి ఎంపికైనవారికి రూ.52 వేల నుంచి రూ. 61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ. 42,500 నుంచి రూ.52వేల వరకు వేతనాలు ఇస్తారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందని, ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవ టానికి టిక్కెట్ సౌకర్యం ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు పాస్‌పోర్టులు, అనుభవం సంబంధిత విద్యా ధ్రువీకరణ పత్రాలతో జూలై 31 వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ 9676965949, 9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఐద్వా 9వ మహాసభలు విజయవంతం చేయాలి

- వాల్‌పోస్టర్ విడుదల



ఐద్వా జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం గంటస్తంభం: ఆగస్టు 19న విజయనగరంలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు, కార్యదర్శి కె.పుణ్యవతి, పి.రమణమ్మలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎల్బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా సంఘం ఉపాధ్యక్షురాలు ఆర్.కృష్ణవేణి, సహాయ కార్యదర్శి వి.లక్ష్మి మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మహిళాహక్కులు, మహిళలకు 33శాతం రిజర్వేషన్, అధిక ధరలకు వ్యతిరేకంగా, ప్రజాసమస్యల పరిష్కారం కోసం మహిళలపై జరిగే దాడులు, హత్యలు, అత్యాచారాలు, లైంగిక, వరకట్న వేధింపులు, స్త్రీవివక్ష, డ్వాక్రామహిళల సమస్యలు, మైక్రోఫైనాన్స్, మద్యం, గంజాయి, డ్రగ్స్, అశ్లీలత మొదలైన సమస్యలపై జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు, పోరాటాలు ఐద్వా నిర్వహించిందని వివరించారు.

నాలుగు ఇసుక లారీలకు జరిమానా

భోగాపురం: మండల కేంద్రంలో సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం అధిక లోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను పట్టుకుని కాటా వేయించారు. నిబంధనలకు విరుద్ధంగా మితిమీరిన లోడుతో వెళ్తున్నట్లు గుర్తించి ఆర్టీఓ నారాయణరావుకు లారీలను అప్పగించారు. దీంతో ఆర్టీఓ వాహనాలకు జరిమానాలు విధించి సీజ్ చేశారు.

తాగుబోతులకు డ్రోన్‌తో అడ్డుకట్ట

- 9 మందిపై కేసుల నమోదు



అలమండ సంతలో మద్యం తాగుతున్న వారిని డ్రోన్స్ ద్వారా గుర్తించిన పోలీసులు

విజయనగరం క్రైమ్: ఇటీవల జిల్లాకు అదనంగా మూడు డ్రోన్స్ రావడంతో వాటితో ఓపెన్ డ్రింకింగ్‌పై పోలీసులు దృష్టిపెట్టారు ఈ మేరకు జామి పోలీస్ స్టేషన్ పరిధి అలమండ సంత పరిసరాల్లో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్‌తో మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం తాగుతున్న 9మందిపై జామి పోలీసులు కేసులు నమోదు చేశారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

సీజనల్ జ్వరాల నియంత్రణకు చర్యలు

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: సీజనల్ జ్వరాల నియంత్రణకు కార్యాచరణపై పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. మలేరియా ప్రభావిత గ్రామాలలో విస్తృతంగా నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణులను కళాజాతా, మొబైల్ వాహనం ద్వారా వీడియో ప్రదర్శన కార్యక్రమాలు ఎక్కువగా ఆకట్టుకుంటాయని, తద్వారా సులభంగా అవగాహన కల్పించవచ్చన్నారు. ఇందుకు గ్రామాల వారీగా రోజువారీ కార్యక్రమ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జ్వరాల నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మలేరియా మందుల కొరత ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఫ్రైడే డ్రైడే, దోమల మందు పిచికారీ పకడ్బందీగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా.ఎస్. భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.టి.జగన్‌మోహన్‌రావు, డా.రఘుకుమార్, డా.కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా రేషన్ బకాయి..!



గొయిపాక డిపో వద్ద జరుగుతున్న చర్చలు

- డిపో తాళాలు విరగ్గొట్టిన గ్రామస్తులు
- 230 బస్తాలు తీసుకెళ్లిన ప్రజలు
- పెద్ద మనుషుల సమక్షంలో రాజీ

గుమ్మలక్ష్మీపురం: నాలుగు నెలలుగా రేషన్ ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు డిపో తాళాన్ని విరగ్గొట్టి ఏకంగా 230 బియ్యం బస్తాలను తీసుకెళ్లారు. ఈ ఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో జరిగింది. మండలంలోని గొయిపాక గ్రామంలో రేషన్ సబ్‌డిపో ఉంది. ఇక్కడ డీలర్‌గా పనిచేస్తున్న కిల్లక జయమ్మ రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిపో పరిధిలోని కిత్తలాంబ, రసాబడి తదితర గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2024 ఆగస్టులో డీలర్ జయమ్మను అధికార పార్టీ ప్రోద్బలంతో అధికారులు సస్పెండ్ చేశారు. తదనంతరం డిపో నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘానికి చెందిన కిల్లక రజని అనే అధికార పార్టీకి చెందిన మరో మహిళకు అప్పగించారు. తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ డీలర్ జయమ్మ కోర్టులో కేసు వేశారు. న్యాయస్థానం స్టే విధించింది. దీంతో జయమ్మ మళ్లీ గొయిపాక డిపో డీలర్‌గా ఈ ఏడాది మేలో విధుల్లో చేరారు. మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ సరుకులను డిపో పరిధిలోని కార్డుదారులందరికీ సరఫరా చేశామని ఆమె చెబుతున్నారు. ఈ క్రమంలో గత ఏడాది తమకు బకాయి ఉన్న బియ్యాన్ని ఇవ్వాలని ఈ నెల 11, 12వ తేదీల్లో డిపో వద్ద కిత్తలాంబ, రసాబడి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొన్ని కారణాల రీత్యా బియ్యం ఇవ్వలేకపోయామని, దఫదఫాలుగా సరఫరా చేస్తానని సదరు డీలర్ వారికి నచ్చజెప్పారు. అనంతరం ఆమె డిపోకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. శాంతించని కిత్తలాంబ గ్రామస్తులు డిపోకు వేసిన తాళాన్ని విరగ్గొట్టి, లోపలున్న 230 బియ్యం బస్తాలను లగేజ్ వ్యాన్‌లో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. దీంతో డీలర్.. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో వివాదాన్ని సర్దుమణిగించేందుకు కొంతమంది పెద్దలు ప్రయత్నాలు సాగించినట్లు సమాచారం.

నెలాఖరులోగా బకాయి బియ్యం సరఫరా

మంగళవారం గొయిపాక డిపో వద్ద గ్రామస్తులు, డీలర్‌తోపాటు, సేల్స్‌మెన్ కమిటీ, పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారులు కలిసి చర్చలు జరిపారు. లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా రెండు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఇచ్చేందుకు డీలర్ అంగీకరించారు. దీంతో డిపో నుంచి తీసుకెళ్లిన రేషన్ బస్తాలను తిరిగి ఇచ్చేందుకు గ్రామస్తులు అంగీకరించినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎప్పుడో బకాయిలకు సంబంధించి ఇప్పుడు నిరసన వ్యక్తం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో కొంతమంది ప్రమేయం ఉన్నట్లు వినిపిస్తోంది.

ఏసీబీవలలో నెల్లిమర్ల కమిషనర్

- ఇంటిప్లాన్ అప్రూవల్‌కు రూ.15వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి



ఏసీబీకి పట్టుబడిన నగరపంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్

నెల్లిమర్ల: విజయనగరం జిల్లా నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ రూ.15వేలు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమ్య అందించిన వివరాల ప్రకారం.. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని పద్మశాలి వీధిలో నివసిస్తున్న బురిడి మహేష్ అదే వీధిలో ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం ఇటీవల దరఖాస్తు చేశారు. దీనికోసం కమిషనర్ రూ.20 వేలు డిమాండ్ చేశారు. రూ.15వేలు నగదు రూపంలో, మిగిలిన రూ.5వేలు దివాన్‌కాట్ బెడ్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాన్ అప్రూవల్ కోసం అవసరమైన ఫీజు చెల్లించానని, లంచం ఇవ్వలేనని ప్రాథేయపడినా కమిషనర్ చలించలేదు. లంచం ఇచ్చుకోలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌కు మహేష్ వెళ్లి రూ.15వేలు అందజేశారు. అప్పటికే కాపుకాసి ఉన్న ఏసీబీ డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వెల్లడించారు.